

విల్లుపురంలో కుండపోత...

స్తంభించిన జనజీవనం

రహదారులన్నీ జలమయం

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం విల్లుపురం పరిసర ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. విల్లుపురం బస్‌స్టేషన్, ఆటో స్టాండు ప్రాంతం, మార్కెట్ ప్రాంతం తదితర ప్రాంతాల్లో మోకాలిలోతున వర్షపునీరు వరదలా ప్రవహించింది. శనివారం రాత్రి 11 గంటలకు ప్రారంభమైన వర్షం ఆదివారం వేకువజాము రెండు గంటల వరకు దంచివడేసింది. ఆ తర్వాత వేకువజాము మూడు గంటలకు కుండపోతగా ప్రారంభమైన వర్షం ఉదయం ఆరుగంటల దాకా కురిసింది. ఈ కుండపోత వర్షానికి విల్లుపురం నగరం పూర్తిగా జలమయమైంది. మున్సిపల్ అధికారులు ఆరు విద్యుత్ మోటారు పంపులతో గంటల తరబడి రహదారుల్లో ప్రవహిస్తున్న వాననీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు. విల్లుపురం, కీళ్‌పెరుంబాక్కం, రైల్వే ఫ్లైఓవర్ ప్రాంతాల్లో వరద దృశ్యాలు నెలకొన్నాయి. విల్లుపురం, పెరుంబాక్కం, కానై, మాంబళపట్టు, కరుంగాలిపట్టు, సాలయగరం, కండమంగళం, వయుదావూరు, అరసూరు, నన్నాడు, అయ్యర్ గరం, ముండియంబాక్కం, కొసపాళయం, ఒరత్తూరు తదితర ప్రాంతాల్లో రాత్రంతా కురిసిన భారీ వర్షానికి రైతులు హర్షం ప్రకటిస్తున్నారు. ఇటీవల వేసిన నారుకు ఈ వర్షం సానుకూలమని చెబుతున్నారు. ఇక మరక్కాణం సమీపంలో కందాడు, కానిమేడు, ముందగపట్టు, వెళ్లకొండాపురం ప్రాంతాల్లో గత మూడు రోజులుగా చెదురుముదురుగా కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో వర్షపునీరు వరదలా ప్రవహిస్తోంది. అనుమందై, ఆలత్తూరు, బ్రహ్మదేశం, ఎండియూరు, కీళపుదుపట్టు చుట్టూ ఉన్న 60 గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోవటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నీట మునిగిన ఉప్పుకయ్యలు..

ఇదిలా ఉండగా మరక్కాణం ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు 3500 ఎకరాల విస్తీర్ణంలో వేసిన ఉప్పుకయ్యలన్నీ నీటమునిగాయి. దీంతో ఉప్పు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రోజూ ఉప్పుకయ్యల్లో పనిచేసే సుమారు రెండు వేలమందికి పైగా కార్మికులు ఇంటివద్దే గడుపుతున్నారు. ఇక అదే ప్రాంతంలో వర్షంతోపాటు వీచిన పెనుగాలులకు 11 విద్యుత్ స్తంభాలు కూడా నేల కొరిగాయి. ఇదే రీతిలో అరటితోటలు, మామిడితోటలు, కొబ్బరి తోటలు, చిలగడదుంప పంటలు భారీ వర్షానికి తీవ్రంగా నష్టపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



విల్లుపురం బస్‌స్టేషన్ వద్ద వరదలా ప్రవహిస్తున్న వర్షపునీరు



కాపుసేవా సమితి అధ్యక్షుడు ఏఎం రత్నంను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఐకమత్యంతోనే అన్నీ సాధ్యం

- కాపు సేవా సమితి వేడుకల్లో సినీ నిర్మాత ఏఎం రత్నం

ప్యారీస్, ఆగస్టు 11: కాపు, బలిజ, తెలగ తదితర సామాజిక వర్గాలవారు ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని, ప్రముఖ సినీ నిర్మాత, కాపుసేవా సమితి అధ్యక్షులు ఏఎం రత్నం పేర్కొన్నారు. చెన్నైలోని కాపు సేవాసమితి ఎనిమిదో వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం టీనగర్ ఆస్కా ప్రాంగణంలో ఘనంగా జరిగింది. సమితి అధ్యక్షుడు గూడపాటి జగన్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలను ఏఎం రత్నం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణదేవరాయల కాలం నుంచి కాపు సామాజికవర్గాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. రాజ్యాధికారం కోసం సమష్టిగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్షిక నివేదికను సమితి కార్యదర్శి పీఆర్ కేశవులు సమర్పించారు. గౌరవ అతిథులుగా పీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ పి. ముత్తువేల్ రాజ్, ఎస్వీఎస్ పాఠశాల అధ్యక్షుడు పీఎం కన్నదాస్, ఆలిండియా నాయుడు సంఘం చెన్నై విభాగం అధ్యక్షులు జీఎస్ వెంకట రాజారామ్, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొని కాపు సేవా సమితి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులకు విద్యా ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. సమితి ఉపాధ్యక్షులు సీవీ రామచంద్ర మూర్తి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమానికి కోటి బాలాజీరావు, జీ గోపి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ముందుగా సంగీత దర్శకులు, గాయకులు ఎంఆర్ సుబ్రహ్మణ్యం బృందం ఆలపించిన తెలుగు పాటలు శ్రోతలను అలరించాయి. అలాగే రేష్మి శుభశ్రీ భరతనాట్య ప్రదర్శన కూడా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. అతిథులు, కళాకారులు, నర్తకిని సమితి నిర్వాహకులు శాలువలతో జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.



వేడుకలకు హాజరైన సమితి సభ్యులు, నగర ప్రముఖులు

సెయింట్ జార్జికోట వద్ద పంద్రాగస్టు ఏర్పాట్లు

పోలీసు దళాల ముందస్తు కవాతు

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సెయింట్ జార్జి కోట ప్రాంగణం వద్ద 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడానికి భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 15ఉదయం సెయింట్ జార్జి కోట బురుజుపై నిలిచి ముఖ్యమంత్రి స్టాలిన్ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. వీర, ధైర్య సాహసాలను ప్రదర్శించిన వారికి అవార్డులు, పతకాలను అందజేయనున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రముఖులు కూర్చునేందుకు సెయింట్ జార్జికోట ఎదురుగా ఉన్న ఉద్యానవన ప్రాంతాల్లో ప్రత్యేకంగా గ్యాలరీలు నిర్మిస్తున్నారు. ఈ వేడుకలకు హాజరయ్యే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ప్రత్యేక ఆహ్వానితులు, నగరవాసులకు వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. సుమారు వెయ్యిమందికిపైగా కార్మికులు, వందమందికిపైగా పోలీసులు ఉన్నతాధికారులు ఈ ఏర్పాట్లలో పాలుపంచుకుంటున్నారు. ఇదే విధంగా వివిధ దళాల కవాతు ముందస్తు ప్రదర్శన కూడా పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఓ పోలీసు అధికారి ఓపెన్‌టాప్ జీపులో సాయుధ దళాల గౌరవవందనం స్వీకరించే కార్యక్రమాన్ని కూడా జరిపారు. అశ్వదళం, కమెండోలు, మహిళా, సాయుధదళం సహా ఏడు రకాల పోలీసు దళాలు స్వాతంత్ర్య దినోత్సవ కవాతులో పాల్గొంటున్నాయి. ఈ వేడుకలకుగాను సచివాలయం పరిసర ప్రాంతాల్లోనే కాకుండా నగరమంతా జనసమర్థమైన ప్రాంతాల వద్ద మఫ్టీ పోలీసులతో నిఘా కూడా ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోకి ప్రవేశించే వాహనాలను తాంబరం, ఆవడి, మాధవరం వైపు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల ద్వారా పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసిన మీదటే అనుమతిస్తున్నారు. నగరంలోని కీలకమైన ప్రాంతాల్లో కూడా సాయుధ పోలీసులు కాపలా కాస్తున్నారు. ఇదే విధంగా రాత్రిపూట పోలీసులు వాహనాల్లో సంచరిస్తూ గస్తీ నిర్వహిస్తున్నారు. రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్ల వద్ద కూడా పోలీసులు కాపలా పెంచారు. బ్రాడ్వే అడయార్ వైపు నుంచి వాహనాల కదలికలపై కూడా పోలీసులు నిఘా వేస్తున్నారు. నగరంలోని ట్రిప్లికేన్, మైలాపూరు, అడయార్, బ్రాడ్వే తదితర ప్రాంతాల్లోని లాడ్జీలు, మేన్షన్లలో పోలీసులు తనిఖీలు జరుపుతున్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా బసచేయడానికి వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని లాడ్జీలు, మేన్షన్‌ల నిర్వహకులకు పోలీసు అధికారులు ఉత్తర్వు జారీ చేశారు. సుమారు పదిహేను వేల మంది దాకా పోలీసులు ఈ భద్రతా విధులలో పాలుపంచుకుంటున్నారని నగర పోలీసు కమిషనర్ అరుణ్ పేర్కొన్నారు.



సెయింట్ జార్జికోట వద్ద రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

ఈసారి శ్రీలంక సముద్రపు దొంగల వంతు

- జాలర్లపై దాడి రూ.4లక్షల దోపిడీ

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు శ్రీలంక నావికాదళం జాలర్లపై దాడిచేసి అరెస్టులు చేసిన ఘటనలే వింటున్నాం.. తాజాగా సముద్రపు దొంగల దాడులతో జాలర్లు భయాందోళన చెందుతున్నారు. చేపలవేట నిషేధం కాలం ముగిసినప్పటి నుంచి గడిచిన మూడు మాసాలపాటు శ్రీలంక నావికాదళం దాడుల్లో 111 మంది జాలర్ల అరెస్టయ్యారు. దీంతో రామేశ్వరం, నాగపట్టినం, పుదుకోట, వేదారణ్యం ప్రాంతాలకు చెందిన జాలర్లంతా చేపలవేటకు వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. ఈ నేపథ్యంలో వేదారణ్యం నుండి చేపలవేటకు వెళ్ళి జాలర్లపై శ్రీలంకకు చెందిన సముద్రపు దొంగలు దాడులకు పాల్పడ్డారు. జాలర్లపై దాడి చేసి వారి పడవల్లో ఉన్న రూ.4లక్షల విలువైన వస్తువులను దోచుకెళ్ళారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి తీరం చేరిన నలుగురు జాలర్లకు వేదారణ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన పట్ల జాలర్ల సంఘంనాయకులంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు శ్రీలంక నావికాదళం, మరో వైపు ఆ దేశానికి చెందిన సముద్రపు దొంగలు దాడులకు పాల్పడుతుంటే చేపలవేటకు ఎలా వెళ్లగలమంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విరుచుకుపడుతున్నారు. ఆరుకాట్టుతురై ప్రాంతానికి చెందిన జాలర్లు శనివారం సాయంత్రం ఫైబర్ పడవల్లో చేపలవేటకు వెళ్ళారు. కోడియక్కరై సముద్ర ప్రాంతంలో శివశంకర్, రాజగోపాల్, ధనశేఖరన్, సెల్వ కృష్ణన్ అనే నలుగురు చేపలుపడుతుండగా నాలుగు పడవల్లో వచ్చిన శ్రీలంక సముద్రపు దొంగలు చుట్టుముట్టి కత్తులు, ఇనుపరాడ్లు, కట్టెలు తదితర మారణాయుధాలతో దాడి చేశారు. ఆ తర్వాత ఫైబర్ పడవల్లో ఉన్న 700 కేజీల బరువు వలలు, జీపీఎస్ పరికరాలు, సెల్‌ఫోన్లు, జాలర్లు ధరించిన బంగారు చైన్లు, ఉంగరాలు సహా సుమారు రూ.4లక్షల విలువైన సంపద దోచుకుని మాయమయ్యారు.ఈసంఘటనపై రాష్ట్ర సముద్రతీర భద్రతాదళం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



చికిత్స పొందుతున్న జాలరి



చెన్నై వ్యాసార్పాడి వివేకానంద విద్యాలయ జూనియర్ కాలేజీలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన ప్రారంభించి తిలకిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి

మత్తులో జోగుతున్న యువత

- పట్టించుకోని డీఎంకే ప్రభుత్వం
- ఈపీఎస్ ధ్వజం



తరగతి గదుల భవనాన్ని ప్రారంభించి విద్యార్థినులకు స్వీట్లు పంచిపెడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఆగస్టు 11 : రాష్ట్రంలో విద్యార్థులు, యువకులు మాదకద్రవ్యాలకు బానిసలై మత్తులో జోగుతూ తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. యువకులు ఇలా మత్తుకు బానిసలవుతున్నా డీఎంకే ప్రభుత్వం మాదకద్రవ్యాల నిరోధానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. సేలం జిల్లా ఎడప్పాడి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఆలోచంపాళయంలో మున్సిపల్ మాధ్యమిక పాఠశాల ప్రాంగణంలో ఎడప్పాడి తన నియోజకవర్గం అభివృద్ధి నిధుల నుండి రూ.72.85లక్షలతో కొత్తగా నిర్మించిన తరగతి గదుల భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను మొట్టమొదటిసారిగా 1989లో అసెంబ్లీ ఎన్నికల్లో కోడి పుంజు గుర్తుపై పోటీ చేసిన సమయంలో ఈ ప్రాంతంలో వెయ్యికిపైగా ఓట్లు సాధించానని, అందువల్లే తాను ఇక్కడి నుంచే ఎమ్మెల్యేగా గెలుస్తున్నానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా వ్యవహరించి ప్రజలకు, తన నియోజకవర్గానికి ఎంతో మేలు చేశానని అందువల్లే ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఎడప్పాడి నియోజకవర్గంలో అన్నాడీఎంకే పార్టీకి అధికశాతం ఓట్లు పడ్డాయన్నారు. రాష్ట్ర ప్రజలు ఎన్నో సమస్యల వలయంలో చిక్కుకుని అవస్థలుపడుతున్నా ఇలాంటి దుస్థితిని చక్కబరచాల్సిన ప్రభుత్వం కారు రేస్‌ను రాజధాని నగరంలో బ్రహ్మాండంగా నిర్వహించేందుకు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయనుందని మండిపడ్డారు. డీఎంకే ప్రభుత్వ క్రీడాశాఖ మంత్రి ఉదయనిధి ఎలాగైనా కారు రేస్ నిర్వహించాలన్న పట్టుదలతో వ్యవహరించడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు లడ్డూలు పంపిణీ చేశారు.



మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో కరచాలనం చేస్తున్న మంత్రి సామినాథన్

మహారాష్ట్ర గవర్నర్‌తో రాష్ట్రమంత్రి ఆకస్మిక భేటీ

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరులో ఆదివారం ఉదయం మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రాష్ట్ర సమాచార శాఖ మంత్రి సామినాథన్ ఆకస్మికంగా కలుసుకున్నారు. ఇద్దరూ పరస్పరం కాసేపు మాట్లాడుకున్నారు. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆదివారం తన స్వస్థలమైన తిరుప్పూరు వెళ్ళారు. ఆ సందర్భంగా ఆయన అవినాశి ఆలయానికి వెళ్ళి స్వామివారిని దర్శించారు. ఆ తర్వాత ఆలయం నుంచి వెలుపలకు వచ్చారు. ఆ సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న రాష్ట్ర సమాచార శాఖమంత్రి ఎంపీ సామినాథన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను చూసి కారును ఆపి దిగి, ఆయనకు నమస్కరించారు. ఆ తరువాత ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్నారు. ఈ అది చూసి బీజేపీ, డీఎంకే కార్యకర్తలు విస్తుపోయారు.

మత్తు పదార్థాలు విక్రయించిన 17 వేల దుకాణాలకు సీలు

- ఆరోగ్యమంత్రి ఎం.సుబ్రమణ్యం



ఈరోడ్‌లో ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న మంత్రి సుబ్రమణ్యం

ప్యారీస్, ఆగస్టు 11: రాష్ట్రంలో మత్తు పదార్థాలు విక్రయించిన 17 వేల దుకాణాలకు సీలు వేసి రూ.33 కోట్లకు పైగా జరిమానా వసూలుచేసినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. ఈరోడ్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఆదివారం ఉదయం గృహ నిర్మాణ శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామితో కలసి మంత్రి సుబ్రమణ్యం పరిశీలించారు. వారు ఆస్పత్రిలో ఉన్న శస్త్రచికిత్స, అత్యవసర చికిత్స, వార్డులు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మించిన 20 పడకలతో కూడిన వార్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడుతూ... ఈరోడ్, కన్నియాకుమారి, తిరుపత్తూర్ సహా నాలుగు జిల్లాల్లో క్యాన్సర్ బాధితుల సంఖ్య అధికంగా ఉందని, ఈ జిల్లాల్లో సుమారు 9.82 లక్షల మందిలో క్యాన్సర్ ఉన్నట్లు పరిశోధనల్లో తేలిందన్నారు. వీరిలో 4.19 లక్షల మందికి ఆరోగ్య శాఖ తరఫున వైద్య పరీక్షలు నిర్వహించామని, 13,089 మందికి ప్రారంభ దశలోనే అవసరమైన చికిత్స అందించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 38 జిల్లాల్లో క్యాన్సర్ పరిశోధన నిమిత్తం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో మాదకద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేసేలా చేపట్టిన చర్యల్లో ఇప్పటివరకు 8,66,619 దుకాణాల నుంచి గుట్కా, పొగాకు ఉత్పత్తులను గుర్తించినట్లు తెలిపారు. ఈ దుకాణాల నుంచి రూ.20.90 కోట్ల విలువైన 3 లక్షల కిలోల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సమాచార ధ్వని

28 నుంచి వాలీబాల్ పోటీలు

ఐసిఎఫ్, ఆగస్టు 11: చెన్నై జిల్లా వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో ఎగ్మూర్‌లో ఈ నెల 28 నుంచి 31వ తేది వరకు వాలీబాల్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు chennaidistrictvolleyballassn@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాలో ఈ నెల 23వ తేదిలోపు పేరు నమోదుచేసుకోవాలి. ఇతర వివరాలకు 9444842628, 9841816778 నెంబర్లు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

15న జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు

ఐసిఎఫ్,ఆగస్టు11:చెన్నై జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 54వ జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలు నెహ్రూ స్టేడియంలో ఈ నెల 15, 26 తేదీల్లో జరుగనున్నాయి. మహిళలు, పురుషుల విభాగంలో 47 పోటీలు నిర్వహించనున్నారు. 15న 16,20 ఏళ్లలోపున్న వారికి, 12,14,19 ఏళ్లలోపున్న వారికి 26వ తేది పోటీలు నిర్వహించనున్నారు.ఈరెండురోజుల్లో జరిగే పోటీల్లో 1,300 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్ సంఘ కార్యదర్శి లత తెలిపారు.

రైల్వేస్టేషన్లలో వ్యాపారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 11: చెన్నై బీచ్-వేళచ్చేరి మార్గంలో ఉన్న ఎమ్మార్టీఎస్ రైల్వేస్టేషన్లలో వ్యాపారం చేసేందుకు సెప్టెంబరు 9వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. ఈ మార్గంలో ఉన్న రైల్వేస్టేషన్లలో ఆహార క్యాంటీన్లు, దుకాణాలు లేవు. ఈ నేపథ్యంలో, 15 రైల్వేస్టేషన్లలో స్టాల్స్ ఏర్పాటుచేసేందుకు ఆసక్తి కలిగిన వ్యాపారులు https://sr.indianrailways.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత స్మార్ట్‌ఫోన్లు

ఐసిఎఫ్, ఆగస్టు 11: వినికిడి, దృష్టి లోపం కలిగిన దివ్యాంగులు స్మార్ట్‌ఫోన్లు పొందేందుకు ఈ నెల 19వ తేదిలోపు ఈ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ తెలిపారు. దివ్యాంగులకు ప్రభుత్వం ఆర్థికసాయంతో పాటు ఉపకరణాలు ఉచితంగా అందజేస్తోంది. ఈ నేపథ్యంలో, 18 ఏళ్లకు పైబడిన విద్యార్థులు, ఉద్యోగులు, స్వీయవృత్తులు చేపట్టే వారికి ఇంటర్వ్యూ ద్వారా స్మార్ట్‌ఫోన్లు అందజేయనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకానికి అనర్హులు. దక్షిణ చెన్నైకి చెందిన అర్హులైన దివ్యాంగులు https://www.tnesevai.tn.gov.in/Citizen/ Registration.aspx అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు.

సివిల్స్‌కు ఉచిత శిక్షణ

ఐసిఎఫ్, ఆగస్టు 11: తిరువారూరులో ఉన్న తమిళనాడు కేంద్ర విశ్వవిద్యాలయంలో ఉపకారవేతనంతో సివిల్స్‌కు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఎస్టీలు ఈ శిక్షణకు ఈ నెల 15వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ శిక్షణలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు https://cutn.ac.in/drambedkarcentreofexcellencedace/2024 అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసి పంపించాలి. ఇతర వివరాలకు www.cutn.ac.in అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

నాగర్‌కోయిల్-తాంబరం మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఆగస్టు 11: ప్రయాణికుల సౌకర్యార్థం నాగర్‌కోయిల్-తాంబరం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● నెం.06012 నాగర్‌కోయిల్-తాంబరం ప్రత్యేక రైలు ఈ నెల 18,12వ తేదీల్లో (ఆదివారం) నాగర్‌కోయిల్‌లో రాత్రి 11.15 గంటలకు బయల్దేరి మరుసటిరోజు 11.15 గంటలకు తాంబరం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06011 తాంబరం-నాగర్‌కోయిల్ ప్రత్యేక రైలు ఈ నెల 19,26 తేదీల్లో (సోమవారం) మధ్యాహ్నం 3.30 గంటలకు తాంబరంలో బయల్దేరి మరుసటిరోజు వేకువజామున 3.45 గంటలకు నాగర్‌కోయిల్ చేరుకుంటుంది.

నేడు మీంజూరు నిర్లవణీకరణ కేంద్రంలో పర్యవేక్షణ

ఐసిఎఫ్, ఆగస్టు 11: తిరువళ్లూర్ జిల్లా మీంజూరులో ఉన్న నిర్లవణీకరణ కేంద్రంలో సోమవారం పర్యవేక్షణ కారణంగా పుళల్ కేంద్రం నుంచి నీటిని సరఫరా చేయనున్నట్లు చెన్నై మెట్రోపాలిటన్ బోర్డు అధికారులు తెలిపారు. రోజుకు 100 మిలియన్ లీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో సముద్ర నీటిని తాగునీటిగా మార్చేందుకు సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పర్యవేక్షణ పనులు జరుగనున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా తిరువొత్తియూర్, ఎర్నావూర్, కత్తివాక్కం, మనలి, మాధవరం, పటేల్ నగర్, వ్యాసర్పాడి ప్రాంతాలకు పుళల్ తాగునీటి శుద్ధీకరణ కేంద్రం నుంచి మంచి నీరు సరఫరా చేయనున్నారు. అత్యవసరాలకు 044-45674567 నెంబరు సంప్రదించాలని మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు.

రేపటి నుంచి తిరునల్వేలిలో శశికళ పర్యటన

ఐసిఎఫ్, ఆగస్టు 11: తిరునల్వేలి జిల్లాలో ఈ నెల 13వ తేది నుంచి ఐదు రోజులు శశికళ పర్యటించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ కార్యకర్తలు, ప్రజలను కలుసుకుంటున్నారు. ఈ క్రమంలో, మంగళవారం నుంచి 18వ తేది వరకు ఆమె ఈ జిల్లాలో పర్యటించనున్నారు. 13వ తేది నెల్లై శాసనసభ నియోజకవర్గం, 14న పాళయంకోట, 16న నాంగునేరి, 17న అంబాసముద్రం, 18వ తేది రాధాపురం శాసనసభ నియోజకవర్గంలో ఆమె పర్యటించి ప్రజలను కలుసుకోనున్నారు.

సహకార ఉద్యోగుల ఆస్తి వివరాల గణన

ఐసిఎఫ్, ఆగస్టు 11: సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగుల చర స్థిరాస్తుల వివరాల సేకరణ ప్రారంభమైంది. సహకార శాఖ ఆధ్వర్యంలో కేంద్ర సహకార సంఘాలు, ప్రాథమిక సహకార రుణ సంఘాలు సహా వివిధ సహకార సంఘాల్లో పనిచేసే ఉద్యోగుల ఆస్తుల వివరాలు ప్రతి సంవత్సరం మార్చి 31వ తేదిలోగా తెలియజేయాల్సి ఉంది. ఈ మధ్యకాలంలో అధికారులు ఈ వివరాలు సేకరించడం లేదు. ఈ నేపథ్యంలో, ఉద్యోగుల ఆస్తుల వివరాలు సేకరించి నివేదిక సమర్పించాలని మండల జాయింట్ రిజిస్ట్రార్‌లకు సహకార శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, సహకార అధికారులు గణాంకాలు ప్రారంభించారు.

రేపటి నుంచి జాతీయ పతాకంతో ర్యాలీలు

● టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై పిలుపు

పెరంబూర్, ఆగస్టు 11: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సోమవారం నుంచి ఈ నెల 15 వరకు జాతీయ పతాకంతో వాహన ర్యాలీలు చేపట్టాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుంతగై పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్ల గడుస్తున్నాయని, ఢిల్లీ కోటపై తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వరుసగా 16ఏళ్లు, ఆయన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రధాన మంత్రులు మొత్తం 54 ఏళ్లలో జాతీయ పతాకం ఎగురవేసిన ఘనచరిత్ర ఉందన్నారు. జాతీయ కాంగ్రెస్‌కు, జాతీయ పతాకానికి విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఈ నెల 12 నుంచి 15వ తేది వరకు అన్ని జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీ, గ్రామాల్లో జాతీయ పతాకం ఎగురవేసి, మోటారు బైక్‌ల ర్యాలీలు చేపట్టాలని సెల్వపెరుందగై పిలుపునిచ్చారు.


చెట్లు, షెడ్ల కింద కూర్చునేందుకు టార్పాలిన్ వేసుకుంటున్న విద్యార్థులు

చెట్లు, షెడ్ల కిందే పాఠాలు

పెరంబూర్, ఆగస్టు 11: విల్లుపురం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో సరిపడేంత తరగతి గదులు లేకపోవడం, పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు చెట్లు, షెడ్ల కింద టార్పాలిన్ వేసుకొని చదువుకుంటున్నారు. కుండాలిపులియూర్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 400 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. ప్రారంభంలో ప్రాథమిక పాఠశాల, అనంతరం మాధ్యమిక పాఠశాల, 2017లో ఉన్నత పాఠశాలగా మార్చారు గతంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరినా వాటిని తొలగించలేదు. దీంతో, సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు చెట్లు, షెడ్ల కింద కూర్చుని చదువుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల ప్రాంగణంలో భారీగా నీరు చేరడంతో అక్కడ కూడా చదువుకొనే అవకాశం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, పాఠశాలను పరిశీలించి అదనపు గదుల నిర్మాణానికి చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ పళని తెలిపారు.

సైనిక పాఠశాలలో 'తల్లికి ఒక మొక్క' కార్యక్రమం


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పెరంబూర్, ఆగస్టు 11: తిరుప్పూర్ జిల్లా ఉడుమలై అమరావతి నగర్‌లో ఉన్న సైనిక పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్తు తరాలకు పచ్చని వాతావరణం అందించేలా పాఠశాల యాజమాన్యం 'తల్లికి ఒక మొక్క' కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి, ఆ మొక్కలకు తమ తల్లి పేరు పెట్టి, వాటిని సంరక్షించనున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మణికంఠన్, లక్ష్మి మణికంఠన్ శనివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, మొక్కలు సక్రమంగా పరిరక్షిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

జయలలిత కోసం మాట్లాడే అర్హత అన్బరసన్‌కు లేదు

● మాజీ మంత్రి డి.జయకుమార్

పెరంబూర్, ఆగస్టు 11: దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత గురించి మాట్లాడే అర్హత టీఎం అన్బరసన్‌కు లేదని మాజీ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. కాంచీపురంలో శనివారం జరిగిన కార్యక్రమంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి టీఎం అన్బరసన్ మాట్లాడుతూ... డీఎంకే అధికారంలో ఉన్నా, లేకున్నా పార్టీ కార్యకర్తలు మాత్రం ఎక్కడికి వెళ్లరన్నారు. రాబోయే కాలంలో సీమాన్ లాంటి నటీనటుడు వస్తున్నారన్నారు. ముఖ్యమంత్రులు కాగలమనే కలతో కొందరు నటులు రాజకీయాల్లోకి వస్తున్నారని తెలిపారు. కానీ, నటుడు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఎంజీఆర్, జయలలితలతో ముగిసిందన్నారు. మంత్రి వ్యాఖ్యలకు అన్నాడీఎంకె నేత, మాజీ మంత్రి జయకుమార్ స్పందిస్తూ.... దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత గురించి మాట్లాడే అర్హత మంత్రి అన్బరసన్‌కు లేదన్నారు. మరణించిన వారిని విమర్శిస్తూ మాట్లాడడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నో సమస్యలుండగా రాష్ట్రప్రభుత్వం ఫార్ములా కారు పందేలపై ప్రధాన దృష్టి సారించిందని, అందువల్లే తాము సుప్రీంకోర్టులో పందేలకు వ్యతిరేకంగా పిటిషన్ వేసినట్లు జయకుమార్ తెలిపారు.

ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్షలు

ప్యారీస్, ఆగస్టు 11: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నీట్ పీజీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సుమారు 25,000 మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో జూన్ 23వ తేది జరగాల్సిన నీట్ పీజీ పరీక్షలకు సుమారు 2 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. మే నెలలో నిర్వహించిన నీట్ పరీక్షలో అవకతవకలు చోటుచేసుకోవడంతో చివరి నిమిషంలో ఈ పరీక్ష వాయిదావేశారు. కాగా ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నీట్ పీజీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మొదటి షిఫ్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో షిఫ్టు 3.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు జరిగింది. ఈ ఆన్‌లైన్ పరీక్షలో రాష్ట్రం నుంచి ఎంబీబీఎస్ పూర్తయిన వైద్యులు సహా దేశవ్యాప్తంగా 2 లక్షల మంది హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరుగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ సమస్యను పరిశీలించిన అధికారులు


పరిశీలిస్తున్న అధికారులు

వేలూరు, ఆగస్టు 11: ఆంబూరు ప్రాంతంలో చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో కొత్త వంతెన నిర్మాణం జరుగుతోంది. దీని కారణంగా ఆ ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని వాహనచోదకులు ఆరోపిస్తున్నారు. దీనిపై స్పందించిన అధికారులు, ఆదివారం వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. 31 స్తంభాలపై ఏర్పాటుకానున్న వంతెన పనుల్లో 225 మీటర్ల ఎక్స్‌టెన్షన్ పనులు మాత్రమే జరిగాయని, త్వరలో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

తలపై కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు


తలపై కొబ్బరికాయలు పగులగొడుతున్న దృశ్యం

పెరంబూర్, ఆగస్టు 11: దిండుగల్ జిల్లా పళని పెరియకలయంపుదూర్ మహాలక్ష్మి ఆలయంలో మహిళా భక్తులు తలపై కొబ్బరికాయల పగులగొట్టించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆడి వేడుకల్లో భాగంగా శనివారం ఆలయ ఆభరణాల పెట్టెను షణ్ముగ నది తీరానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేసి ఆలయానికి తీసుకొచ్చారు. అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్తంభంపై దీపం వెలిగించి, తలా ఎనిమిది పురుషులు, మహిళలు తలలపై కొబ్బరికాయలు పగులగొట్టించుకొనే కార్యక్రమం జరిగింది. పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

ఘనంగా శ్రీమాతమ్మ ఆలయ జాతర


శ్రీమాతమ్మ ఊరేగింపులో పాల్గొన్న నిర్వాహకులు

ప్యారీస్, ఆగస్టు 11: స్థానిక ట్రిప్లికేన్ స్వతంత్ర నగర్‌లోని శ్రీమాతమ్మ ఆలయ 61వ ఆడి మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకు పైగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి ఏడు గంటలకు విశేషాలంకరణతో అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధులలో ఊరేగించారు. ఆదివారం ఉదయం అమ్మవారి కలశ ఉత్సవం, అంబలి వినియోగం, సహపంక్తి భోజనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు గోవిందరాజ్, అముల్‌రాజ్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, సుబ్బారావు, కృష్ణమూర్తి, మాధవ, సంజయ్, బాబు, నాగేంద్ర, కాకి వెంకటేశ్వర్లు, స్వతంత్రనగర్ ఆదిఆంధ్రా ప్రజా సంక్షేమ సంఘం గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో సేవించారు.

దురై దయానిధికి హత్యా బెదిరింపు

● ఆస్పత్రి వద్ద భద్రత పెంపు



చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోదరుడు, కేంద్ర మాజీ మంత్రి ఎంకే అళగిరి కుమారుడు దురైదయానిధికి హత్యాబెదిరింపు రావటంతో ఆస్పత్రి వద్ద పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆ అస్పత్రి ఏ బ్లాక్‌లో దురైదయానిధి ఫిజియోథెరపీ చికిత్స పొందుతున్నారు. ఆయనతోపాటు తండ్రి ఎంకే అళగిరి కుటుంబీకులు కూడా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సీఎంసీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ కార్యాలయానికి శనివా రం రాత్రి దురైదయానిధి హతమారుస్తామంటూ ఓ ఈమెయిల్ వచ్చింది. వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆ ఈమెయిల్‌ను డీఎస్పీ కిరణ్ సృతికి పంపించారు. దీంతో ఆ ఈమెయిల్ పంపిన వ్యక్తిని కనుగొనేందుకు సైబర్ క్రైం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో దురైదయానిధి చికిత్స పొందుతున్న ఎ-బ్లాక్ వద్ద అదనంగా ఓ ఎస్ఐ నేతృత్వంలో ముగ్గురు సాయుధ పోలీసులను నియమించారు. ఆదివారం ఉదయం వేలూరు డీఎస్పీ తిరునావుక్కరసు ఆస్పత్రికి వెళ్లి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.


ఆస్పత్రి వద్ద పోలీసుల కాపలా

వైభవంగా భవాని అమ్మన్ ఆలయ కలశం ఊరేగింపు


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

వేలూరు, ఆగస్టు 11: స్థానిక కాట్పాడి ధారాపడవీడు కస్తూరిబాయ్ వీధిలో ఉన్న భవాని అమ్మన్ ఆలయ ఆడి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం విశేష అభిషేకాలు, అలంకారం, దీపారాధన జరిగింది. వేడుకల్లో భాగంగా కలశ ఊరేగింపు, అంబళ్లు పోసే కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, కాట్పాడి వెస్ట్ ప్రాంత సెక్రటరీ సునీల్‌కుమార్ కుటుంబ సభ్యులతో పాల్గొని అమ్మవారికి సారె సమర్పించారు.

శంకరాచార్యులపై భక్తి ప్రసంగ కార్యక్రమం


భక్తి ప్రసంగంలో విఘ్నేష్ భాగవతార్

వేలూరు, ఆగస్టు 11: కాంచీపురం శంకరాచార్య భక్తులు సహాయ సంస్థ ట్రస్ట్ తరఫున శంకరాచార్యుల జీవిత విశేషాలపై భక్తి ప్రసంగం మూడు రోజులు సత్తువాచేరి గాయత్రి కల్యాణ మండపంలో జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాత్యాయని అధ్యక్షత వహించి 108 దీపాల పూజ ప్రారంభించారు. దీనిలో కర్ణాటక సినీ నేపథ్య గాయకుడు మోహన్ వైద్య, మాంబాక్కం విఘ్నేష్ భాగవతార్, బీజేపీ రాష్ట్ర సెక్రటరీ ఇళంగోవన్, ఉప సెక్రటరీ రాఘవకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విఘ్నేష్ భాగవతార్ అధ్యక్షతన భక్తి ప్రసంగం జరిగింది. కార్యక్రమంలో భాగంగా బాలాజి భాగవతార్ ఆధ్వర్యంలో ఆండాళ్ కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్వో రాజ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో వసతుల కొరత


ప్రభుత్వాసుపత్రిలో చిన్న గదిలో ఉన్న మెడికల్ షాపు


వేలూరు, ఆగస్టు 11: స్థానిక అడుక్కుమ్‌పారైలో ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రి ఉంది. ఇక్కడ ఎమర్జెన్సీ విభాగంలో 24 గంటలు 10 మంది వైద్యులు షిఫ్టు విధానంలో పనిచేస్తున్నారు. ఇక్కడ 34 శాఖల్లో ఇన్‌పేషంట్ రోగుల డిశ్చార్జి, అత్యవసర చికిత్స రెడ్ జోన్, ఎల్లో జోన్ రోగులు రోజుకు 300 మంది రోగులకు మందులు ఇస్తున్నారు. ఇక్కడ ఉన్న అత్యవసర మందుల షాపు చిన్న గదిలో ఉంది. ఐదు సంవత్సరాల నుంచి ఈ చిన్న గదిలోనే మందులు ఇస్తున్నారు. 24 గంటలు పనిచేసే ఈ దుకాణం మందులు స్టాకు ఉంచేందుకు తగిన స్థలం లేదు. అలాగే, మందులు తీసుకొనేందుకు రోగులు వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సమాజ శ్రేయోభిలాషులు కోరుతున్నారు.

పాలు తాగిన వారాహి అమ్మవారు


అమ్మవారికి పాలు తాగిస్తున్న భక్తులు

పెరంబూర్, ఆగస్టు 11: దిండుగల్ జిల్లా ముంగిల్‌పట్టి గ్రామంలో సాయిబాబా ఆలయం ఉంది. ఆలయంలో ఉన్న వనవారాహి అమ్మవారికి ప్రతిరోజు అభిషేకాలు, పూజలు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా పంచమి తిథిలో తెల్లవారుజాము నుంచే అమ్మవారి దర్శనానికి స్థానికులతో పాటు పొరుగు జిల్లాలకు చెందిన భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో, శనివారం నాగపంచమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆ సమయంలో భక్తులు అమ్మవారికి పాలు నైవేద్యంగా సమర్పించేలా చెంచాలో పాలు పెట్టగా, అమ్మవారు పాలు తాగడంతో భక్తులు పరవశించిపోయారు. కొందరు భక్తులు దానిని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు.

కొళ్లిడం వాగులో మొసలి పట్టివేత



చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా కొళ్లిడం వాగులో మొసలి పట్టుబడింది. చిదంబరం, కాట్టుమన్నార్‌కోవిల్, అగరనల్లూరు, వల్లంపడుక్కై, వేలకుడి, కండియామేడు గ్రామాలను ఆనుకుని ఈ వాగు ప్రవహిస్తుంది. ఆదివారం ఉదయం కాట్టుకూడలూరు వద్ద ఆ వాగులో కాళ్లు కడుక్కునేందుకు ఓ బాలుడు వెళ్ళినప్పుడు నీటిలో మొసలి కనిపించింది. దీంతో ఆ బాలుడి కేకలకు స్థానికులు పరుగెత్తుకొచ్చి నీటిలో ఈదుతున్న మొసలిని చూశారు. ఆ తర్వాత అందరూ కలిసి ఆ మొసలిని బంధించి, లారీలో తీసుకువెళ్ళి అటవీశాఖాధికారులకు అప్పగించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 11: విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నంగనల్లూర్: హిందూ కాలని, ఎన్జీవో కాలని, కేకే నగర్ టీచర్స్ కాలని, ఎస్బీఐ కాలనీ ఎక్స్‌టెన్షన్, ఏజీఎస్ కాలనీ, దురైస్వామి గార్డన్, విజయ్ అవెన్యూ, ఎస్బీఐ కాలని, లక్ష్మి నగర్ 4వ స్టేజ్, టీవీ నగర్ వెస్ట్ ఏరియా, కుబేరన్ నగర్, ఎల్ఐసీ నగర్, మయిలై కపాలీశ్వర నగర్, బాలాంబిగై నగర్, కర్పగాంబాల్ నగర్, రాజరాజేశ్వరి నగర్, శ్రీ నగర్.

తాంబరం: ముడిచూర్ భారతి అవెన్యూ, చిత్ర అవెన్యూ, బాలాజీ నగర్, కురింజి నగర్, కాకా భుజేంద్రన్ నగర్, కామరాజర్ హైరోడ్డు, శరబోపన్ నగర్, మాడంబాక్కం ఏఎల్ఎస్ నగర్, రమణ నగర్, మాడంబాక్కం ప్రధాన రహదారి, తూర్పు, ఉత్తర, పశ్చిమ మాడవీధులు, మాణిక్యం అవెన్యూ, పద్మావతి నగర్, అగరం మెయిన్ రోడ్డు, వేదాచలం నగర్, ఎస్సార్ కాలని, ఐఏఎఫ్ రోడ్డు, రికిల్ గార్డన్, హరిణి అపార్ట్‌మెంట్స్, సుమేలి సిటీ.

రాజ్ కీల్పాక్కం: మనవాళనగర్, వీజీపీ గోల్డన్ నగర్, భాగ్యం నగర్, ఏరికరై వీధి, లక్ష్మి నగర్, సెంథిల్ అవెన్యూ, ప్రశాంత్ కాలని, నవనీతం నగర్

పుదుతాంగల్: దేవరాజ్‌పిళ్లై వీధి, వీజీఎన్, నిత్యానందం నగర్, పెరుమాళ్ ఆలయ వీధి, జీఎస్టీ రోడ్డు, సర్వీస్ రోడ్డు.

ఆవడి: మిట్టనమల్లి ఐఏఎఫ్ రోడ్డు, మిట్టనమల్లి కాలని, బృందావనం నగర్, రాజీవ్ గాంధీ నగర్, సీఆర్‌పీఎఫ్ క్వార్టర్స్, సీఆర్‌పీఎఫ్ నగర్.

డెలివరీ ఉద్యోగులపై 8,500 కేసులు

ఐసిఎఫ్, ఆగస్టు 11: డెలివరీ ఉద్యోగులపై 8,500 ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. నగరంలో ప్రస్తుతం స్విగ్గీ, జుమాటో, పిగ్, పాస్లేట్, అమెజాన్ సహా ఆన్‌లైన్ డెలివరీ సంస్థల్లో 40,000 నుంచి 50,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో 18 నుంచి 30 ఏళ్లలోపున్న వారు ఎక్కువగా ఉన్నారు. ఇటీవల వీరు రహదారుల్లో వేగంగా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా వెళ్లడం వంటి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఈ ఏడాది నిబంధనలు ఉల్లఘించిన వారిపై 8,500 కేసులు నమోదు చేసినట్లు చెన్నై ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కూల్‌డ్రింక్ తాగి ఐదేళ్ల బాలిక మృతి

పెరంబూర్, ఆగస్టు 11: కూల్‌డ్రింక్ తాగిన బాలిక మృతిచెందిన ఘటన కాంచీపురం జిల్లాలో శనివారం చోటుచేసుకుంది. సెయ్యారు సమీపం వెంబాక్కం తాలూకా కనికిలప్పు గ్రామానికి చెందిన రైతు రాజ్‌కుమార్ కుమార్తె కవిశ్రీ (5), శనివారం ఇంట్లో ఉన్న కూల్‌డ్రింక్ తాగింది. కొద్దిక్షణాల్లో బాలిక శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతూ నోట్లో నురగలు కక్కుకుని పడిపోయింది. దీంతో, దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు బాలికను కాంచీపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం చెంగల్పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఈ ఘటనపై దూసి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పాఠశాలలో ఆడుకుంటూ విద్యార్థి మృతి

పెరంబూర్, ఆగస్టు 11: పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటున్న విద్యార్థి మృతిచెందిన ఘటన తూత్తుకుడి జిల్లాలో చోటుచేసుకుంది. బొమ్మయాపురం గ్రామానికి చెందిన ముత్తు కుమారుడు మహేంద్రన్ (12) శివజ్ఞానపురంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. పనిమయ మాత ఆలయ వేడుకల సందర్భంగా ఈ నెల 5వ తేది జిల్లాకు సెలవు ప్రకటించిన నేపథ్యంలో, శనివారం పనిదినంగా జిల్లా యంత్రాంగం ప్రకటించింది. ఉదయాన్ని పాఠశాలకు వెళ్లిన మహేంద్రన్ సాయంత్రం తోటి విద్యార్థులతో కలసి మైదానంలో ఆడుకుంటున్నాడు. హఠాత్తుగా మహేంద్రన్ స్పృహ తప్పి పడిపోయాడు. ఉపాధ్యాయులు వెంటనే అతడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విషవాయువు సోకి కార్మికుడి మృతి

ప్యారీస్, ఆగస్టు 11 : స్థానిక ఆవడి ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ మరమ్మతులో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికుడు గోపీనాథ్ (25) విషవాయువు సోకి మృతి చెందాడు. ఆవడి సరస్వతీనగర్‌లో ఉన్న భూగర్భడ్రైనేజీ కాలువలో చేపట్టిన పూడికతీత పనుల్లో ఆ కార్పొరేషన్‌కు చెందిన సుమారు 30 మందికి పైగా కాంట్రాక్టు కార్మికులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఈ పనుల్లో పాల్గొన్న గోపీనాథ్ కాలువలో ఉన్నట్టుండి విషవాయువు రావడంతో ఊపిరాడక మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

పిడుగుపాటుకు చూపు కోల్పోయిన బాలిక

పెరంబూర్, ఆగస్టు 11: విల్లుపురం పిడుగుపాటుకు ఓ బాలిక చూపు కోల్పోయింది. విల్లుపురం, పరిసర ప్రాంతాల్లో శనివారం రాత్రి 11 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు భారీ వర్షం కురిసింది. శనివారం కక్కనూరు గ్రామానికి చెందిన అశోక్ కుమార్ ఇంటి సమీపంలోని చెట్టుపై పిడుగు పడింది. ఈ కారణంగా ఇంట్లో ఎలక్ట్రానిక్ వస్తువులు పేలిపోయాయి. ఆ సమయంలో వచ్చిన భారీ వెలుతురు కారణంగా అశోక్ కుమార్తె సంపతి కంటి చూపు కోల్పోయింది. తల్లిదండ్రులు ఆమెను వెంటనే విల్లుపురం ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించగా, ఐసీయూలో ఉంచిన వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు.

ఫుట్ బాల్ మ్యాచ్‌లో ఓడిన విద్యార్థులు

● చితకబాదిన పీఈటీ టీచర్

పెరంబూర్, ఆగస్టు 11: విద్యార్థులను ఓ టీచర్ కాళ్లతో కొడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సేలం జిల్లా మేట్టూరు సమీపం కొళత్తూర్‌లోని ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు, మరో పాఠశాల విద్యార్థుల మధ్య శనివారం ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో ఎయిడెడ్ పాఠశాల టీమ్ పరాజయం పాలైంది. పరాజయం చెందామన్న ఆవేదనతో విద్యార్థులు మైదానం సమీపంలో కూర్చున్నారు. ఆసమయంలో ఊహించని విధంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నామలై విద్యార్థుల వద్దకు వచ్చి వారిని దూషిస్తూ కాళ్లతో కొట్టాడు. అలాగే, బూటు తీసి, విద్యార్థుల జుట్టు పట్టుకొని కొడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విడుదల కావడంతో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు దిగ్భ్రాంతి చెందారు. పెద్దసంఖ్యలో పాఠశాల వద్దకు చేరుకున్న తల్లిదండ్రులు, వ్యాయామ ఉపాధ్యాయుడిని తొలగించడంతో పాటు అరెస్ట్ చేయాలని ఆందోళన చేపట్టారు.

ప్రాచీన చదరంగం పావులు లభ్యం


బంకమట్టి పావులు

ఐసిఎఫ్, ఆగస్టు 11: విరుదునగర్ జిల్లా విజయకరిశల్‌కుళంలో జరిపిన తవ్వకాల్లో ప్రాచీన చదరంగం పావులు లభించాయి. ఈ ప్రాంతంలో మూడో విడత తవ్వకాల్లో ఇప్పటివరకు మట్టి బొమ్మలు, అస్థిపంజరాలు, ప్రమిదలు, శంఖంతో తయారైన గాజులు, గాజు వస్తువులు, పూసల దండలు వంటి 1,250కి పైగా వస్తువులు దొరికాయి. శనివారం తవ్వకాల్లో పురాతన ఇటుకలు, మట్టి కుండ పెంకులు, బంకమట్టితో తయారు చేసిన చదరంగం పావులు లభించాయి. ఈ విషయమై పురావస్తు పరిశోధకులు మాట్లాడుతూ... పూర్వీకులు వివిధ వృత్తులు చేపట్టడమే కాకుండా క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తుందన్నారు.

పొన్ మాణిక్కవేల్‌పై కేసు నమోదు

ప్యారీస్, ఆగస్టు 11: విగ్రహాల స్మగ్లింగ్ వ్యవహారంలో మాజీ ఐజీ పొన్ మాణిక్కవేల్‌పై 13 సెక్షన్ల కింద కేసు నమోదైంది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో విగ్రహాల స్మగ్లింగ్ నివారణ విభాగం పోలీసు ఐజీగా పొన్ మాణిక్కవేల్ పనిచేశారు. ఆ సమయంలో అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాతో చేతులు కలిపి అరుదైన దేవతామూర్తుల విగ్రహాలను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు ఎదుర్కొన్న తిరువళ్లూర్ మాజీ డీఎస్పీ ఖాదర్‌బాషాపై సస్పెన్షన్ వేటుపడింది. కక్ష్య సాధింపు ఉద్దేశంతో పొన్ మాణిక్కవేల్ తనపై కేసు నమోదుచేశారని ఆరోపిస్తూ ఖాదర్‌భాషా మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠా సంబంధాలుండడంతో ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అప్పటి నుంచి పొన్ మాణిక్కవేల్ వద్ద విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈసీఆర్ రోడ్డులోని పాలవాక్కంలో ఉన్న పొన్ మాణిక్కవేల్ ఇంట్లో సీబీఐ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. సుమారు 8 గంటలు సాగిన ఈ సోదాల్లో విగ్రహాలకు సంబంధించిన ప్రభుత్వ దస్తావేజులను సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. విచారణ అనంతరం పొన్ మాణిక్కవేల్‌పై 13 సెక్షన్ల కింద కేసు నమోదుచేసినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, తన నివాసంలో సీబీఐ అధికారుల తనిఖీ నిర్వహించడంపై పొన్ మాణిక్యవేల్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... దేవతామూర్తుల విగ్రహాల స్మగ్లింగ్‌లో అంతర్జాతీయ స్మగ్లర్ సుభాష్‌చంద్ర కపూర్‌కు పదేళ్ల జైలుశిక్ష పడేలా చర్యలు చేపట్టానని, ఆయనపై మరో ఆరు కేసులు కూడా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఆయనకు వ్యతిరేకంగా ఛార్జిషీటు దాఖలుచేయలేదన్నారు. ప్రస్తుతం సీబీఐ అధికారులకు విగ్రహాల స్మగ్లింగ్‌కు సంబంధించిన ఆధారాలు సమర్పించానని, తనపై నమోదైన కేసులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. విదేశాల నుంచి ఇంకా 1,000కి పైగా పంచలోహ విగ్రహాలు విడిపించి దేశానికి తీసుకురావాల్సి ఉందని, తానంటే గిట్టని వారు తనకు వ్యతిరేకంగా తప్పుడు కేసులు నమోదుచేశారని ఆయన తెలిపారు.

గిండీ స్నేక్ పార్క్‌కు మూడు అనకొండ పిల్లలు

ఐసిఎఫ్, ఆగస్టు 11: స్థానిక వండలూరు జూ పార్క్ నుంచి మూడు అనకొండ పాలు పిల్లలను గిండి స్నేక్ పార్క్‌కు తరలించారు. ఎకరా విస్తీర్ణంలో గిండి స్నేక్ పార్క్‌ను 1972లో నిర్మించారు. ఇక్కడ 32 రకాలకు చెందిన 300లకు పైగా సరీసృపాలున్నాయి. ఈ నేపథ్యంలో, వండలూరు జూ పార్క్ నుంచి ఏడాదిన్నర వయస్సున్న మూడు అనకొండ పిల్లలను స్నేక్ పార్క్‌కు దిగుమతి చేసుకున్నారు.

62 ఏళ్లకు పదవీ విరమణ వదంతులు మాత్రమే

పెరంబూర్, ఆగస్టు 11: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పదవీవిరమణ కాలం 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తీర్మానం చేసినట్లు, ఈ విషయమై 15 రోజుల్లో జీవో విడుదల కానున్నట్లు వస్తున్న వార్తలు వదంతులు మాత్రమేనని రాష్ట్రప్రభుత్వం వివరణ ఇచ్చింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంక్షోభం కారణంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పదవీవిరమణ వయస్సు 2021లో 58 నుంచి 60 ఏళ్లకు పెంచింది. అనంతరం డీఎంకే అధికారం చేపట్టి మూడేళ్లు గడిచినా ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏళ్లుగానే కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పదవీవిరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్లు, ఈ విషయమై 15 రోజుల్లో అధికారిక జీవో విడుదలవుతోందని వార్తలు వచ్చాయి. ఈ విషయమై రాష్ట్రప్రభుత్వం తన ఎక్స్‌లో... ఆ వార్తలు పూర్తిగా వదంతులు మాత్రమేని, అలాంటి ఆలోచన కూడా లేదని స్పష్టం చేసింది.



'వయనాడ్' కోసం ధనుష్ రూ.25 లక్షల విరాళం

కేరళ రాష్ట్రంలో ప్రకృతి సృష్టించిన బీభత్సంలో చిక్కుకుని రూపురేఖలు మారిపోయిన వయనాడ్ ప్రాంతంలో సహాయక చర్యలు చేపట్టేందుకు అనేక మంది సినీ ప్రముఖులు పెద్ద మనసుతో విరాళాలు ఇస్తున్నారు. ఇందులోభాగంగా తమిళ చిత్రపరిశ్రమ నుంచి అనేక మంది నటీనటులు ఆర్థిక సాయం చేశారు. తాజాగా హీరో ధనుష్ కూడా తనవంతు సాయంగా రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయనున్నట్టు ఆయన ఆదివారం ప్రకటించారు. కాగా, ఇప్పటికే అగ్ర నటుడు కమల్ హాసన్, సూర్య - జ్యోతిక దంపతులు, హీరో కార్తి, నయనతార - విగ్నేష్ దంపతులు, శివకార్తికేయన్ ఇలా అనేక మంది సినీ సెలెబ్రిటీలు విరాళాలు ఇచ్చారు. అలాగే, సుహాసిని, మీనా, ఖుష్బూ, లిజి కలిసి చెన్నై ఫిల్మ్ మేకర్స్ తరపున రూ.కోటి విరాళం అందజేశారు. ఇదిలావుంటే, హీరో ధనుష్ తాను నటించిన దర్శకత్వం వహించిన 'రాయన్' చిత్రం విజయంతం కావడంతో ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమా సక్సెస్ వేడుకలను ఆయన శనివారం రాత్రి నగరంలో జరుపుకున్నారు. ఈ సినిమా ధనుష్ నటించిన 50వ చిత్రం కూడా. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ఎంతగానో ఆదరించారని, ఇకపై మీ ఆదరాభిమానాలు, మద్దతు కొనసాగించాలని హీరో ధనుష్ కోరారు.

చిత్రజ్యోతి

'లారా' ఫస్ట్‌లుక్ రిలీజ్

కోయంబత్తూరు జిల్లాలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ యజమాని, ఎంకే అసోసియేట్స్ అధినేత ఎం.కార్తికేశన్ సినిమా రంగంలోకి అడుగుపెట్టి ఎంకే ఫిల్మ్ మీడియా వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై నిర్మించిన తొలి చిత్రం 'లారా'. ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి తాజాగా రిలీజ్ చేశారు. మణిమూర్తి అనే నూతన దర్శకుడు ఈ సినిమా డైరెక్ట్ చేశారు. ఈ మూవీలో 'పిడిచ్చిరుకు మురుగా' ఫేం అశోక్ కుమార్ హీరోగా నటించగా, అనుశ్రీ, వెన్మతి, వర్షిణి హీరోయిన్లుగా, ఇతర పాత్రల్లో మాథ్యూ వర్గీస్, కార్తికేశన్, ఎస్‌కే బాబు నటించారు. ఇన్వెస్టిగేషన్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందించారు. కొన్నేళ్ళ క్రితం పుదుచ్చేరిలోని కారైక్కాల్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించారు. ఈ మూవీ టైటిల్‌ను సీనియర్ నటుడు సత్యరాజ్ రిలీజ్ చేశారు. ఇపుడు ఫస్ట్‌లుక్‌ను విజయ్ సేతుపతి రిలీజ్ చేసి... చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ సినిమాకు కెమెరా ఆర్జే రవిన్, ఎడిటింగ్ వలర్‌పాండి, పాటలు ఎం.కార్తికేశన్, ముత్తమిళ్, సంగీతం రఘు శరవణ కుమార్.



ఫస్ట్‌లుక్ రిలీజ్ చేస్తున్న విజయ్ సేతుపతి

రజనీతో షాట్ అనగానే జ్వరం వచ్చింది

● దుషార విజయన్



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా దర్శకుడు టీజే జ్ఞానవేల్ రూపొందిస్తున్న 'వేట్టయ్యన్'లో యువ నటి దుషార విజయన్ గోల్డెన్ ఛాన్స్ దక్కించుకుంది. ఈ అవకాశంపై ఆమె తాజాగా స్పందించింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, 'వేట్టయ్యన్' చిత్రంలో తలైవర్‌తో కలిసి నటించాననే గర్వంతో పాటు భయం ఏర్పడింది. షూటింగ్‌కు ముందు రోజు ఏకంగా జ్వరమే వచ్చింది. ఆయనతో కలిసి నటించే సమయంలో ఒక వైపు జ్వరం, మరోవైపు ముచ్చెమటలు పట్టాయి. పట్టరాని సంతోషం.. మరోవైపు భయం, ఆందోళన. ఈ రెండింటిని ఏకకాలంలో అనుభవించాను. అలాంటి మానసికస్థితిలో రజనీతో కలిసి నటించాను. ఇది ఒక కలగానే ఉంది. అలాగే, ఫహద్ ఫాజిల్‌తో కలిసి 'వేట్టయ్యన్' కోసం కలిసి చేయడం కూడా గొప్ప అనుభూతిగా ఫీలవుతున్నాను. అందుకే 'రాయన్' తరహాలోనే 'వేట్టయ్యన్' మూవీ కూడా నా కెరీర్ నిలిచిపోతుంది' అని పేర్కొన్నారు.

'రెడ్‌ఫ్లవర్' డబ్బింగ్ షురూ


డబ్బింగ్ ప్రారంభోత్సవ పూజా దృశ్యం

కాళింకాంబాల్ పిక్చర్స్ పతాకంపై కె.మాణిక్యం భారీ బడ్జెట్‌తో నిర్మించిన చిత్రం 'రెడ్‌ఫ్లవర్' నిర్మాణం పూర్తి చేసుకుని డబ్బింగ్ ప్రారంభమైంది. హీరో విగ్నేష్ ద్విపాత్రాభినయనం చేశారు. ఫ్యూచరిస్టిక్ యాక్షన్ థీమ్, ఆకట్టుకునే విజువల్ ఎఫెక్ట్స్‌తో నిర్మించారు. మనీషా జష్నాని హీరోయిన్‌గా, నాజర్, వైజీ మహేంద్రన్, సురేష్ మీనన్, జాన్విజయ్, అజయ్ రత్నం, లీలా శాంసన్, డీఎం కార్తీక్, గోపికన్నదాసన్, తలైవాసల్ విజయ్, మోహన్ రామ్ తదితరులు నటించారు. ఈ సినిమా గురించి దర్శకుడు ఆండ్రూ పాండ్యన్ మాట్లాడుతూ, 'చిత్రీకరణ పూర్తి చేసుకుని డబ్బింగ్ ప్రారంభించాం. 'రెడ్‌ఫ్లవర్' మంచి కథతో తెరకెక్కించాం. ఈ సినిమా కోలీవుడ్‌లో ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుంది. త్వరలోనే ఆడియో, ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం' అని ఆయన పేర్కొన్నారు.

సూర్య కాంతి ద్వారా వినేశ్ ఫోగాట్ చిత్రం


సూర్య కాంతితో వినేశ్ ఫోగట్ చిత్రం రూపొందిస్తున్న కార్తీక్

పెరంబూర్, ఆగస్టు 11: విరుదునగర్ జిల్లా తిరుత్తంగల్ స్టాండర్డ్ కాలనీకి చెందిన కార్తీక్‌కు చిత్రలేఖనంపై ఆసక్తి అధికం. పలు రకాల పెయింటింగ్ వేసే కార్తీక్, సన్ లైట్, గ్లాస్ లెన్స్ ద్వారా చిత్రాలను రూపొందిస్తుంటాడు. ఇప్పటికే కార్తీక్ ఈ విధానంలో సినిమా నటులు, రాజకీయ నేతలు, క్రీడాకారులు ఇలా పలువురి చిత్రాలు వేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. తాజాగా, పారిస్ ఒలింపిక్స్‌లో మల్లయుద్ధంలో పాల్గొన్న భారత్ క్రీడాకారిణి వినేశ్ ఫోగట్ అధిక బరువు కారణంగా పోటీల నుంచి బహిష్కరించబడిన విషయం తెలిసిందే. కానీ, వినేశ్ ఫోగట్‌కు దేశ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ నేపథ్యంలో, వినేశ్ ఫోగట్ చిత్రపటాన్ని సన్ లైట్, గ్లాస్ లెన్స్ ద్వారా కార్తీక్ రూపొందించాడు. కార్తీక్ పలువురు ప్రముఖులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ఘనంగా వేలమ్మాళ్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

ఐసిఎఫ్, ఆగస్టు 11: తిరువళ్లూర్ జిల్లా పొన్నేరి సమీపంలోని పంజెట్టిలో ఉన్న వేలమ్మాళ్ ఇంటర్నేషనల్ స్కూల్20వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ పాఠశాలలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులే కాకుండా ఆంధ్రప్రదేశ్, విదేశీ విద్యార్థులు కూడా చదువుతున్నారు. ఇక్కడ చదువుతున్న విద్యార్థుల్లో పలువురు చదువు, కళలు, క్రీడల్లో రాణిస్తున్నారు. విద్యాశాఖ డైరెక్టర్ గీతాంజలి సమక్షంలో వేలమ్మాళ్ ఎడ్యుకేషనల్ కమిటీ డైరెక్టర్ ఎంవీఎం శశికుమార్ వార్షికోత్సవాలు ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా డా.ఈ.రాంప్రసాద్, డా.సూసన్ ఎల్లిస్ దండాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్య, కళల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులను సన్మానించారు.

సేయాతమ్మన్ ఆలయంలో ఆషాఢ ఆదివారం వేడుకలు

గగుర్పాటు కలిగించిన భక్తుల మొక్కుబడులు


కావడితో వెళ్తున్న బాలుడు


వలయాకార రాట్నం పైపుల దిగువ వీపులకు ఇనుప కొక్కీలను తగిలించుకుని వేలాడుతున్న భక్తులు


మోటారు బైకుపై ఆశీనులై భక్తులకు కనువిందు చేస్తున్న సేయాతమ్మన్


క్షీరకలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళా భక్తులు

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తమిళ ఆషాఢం ఆడి నాలుగో ఆదివారం సందర్భంగా నగరంలోని అమ్మవారి ఆలయాలన్నీ క్షీరకలశాల ఊరేగింపు, భక్తుల వింత మొక్కుబడులు, అంబళ్ల సమర్పణ, చిత్రవిచిత్ర వాయిద్యాల మోతతో హోరెత్తాయి. స్థానిక కొరట్టూరు ప్రాంతంలోని సేయాతమ్మన్ ఆలయంలో జరిగిన వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం సుమారు రెండు వందల మందికి పైగా మహిళలు క్షీర కలశాలతో ఊరేగింపుగా పాదయాత్ర చేస్తూ వచ్చి పాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. ఆ తర్వాత భక్తులు అమ్మవారికి వింత విన్యాసాలతో తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. వలయాకార రాట్నం పైపుల దిగువ పసుపు వస్త్రాలు ధరించిన భక్తులు తమ వీపులకు కొక్కీలను తగిలించుకుని వేలాడుతూ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. ఇదే విధంగా కొందరు భక్తులు వంటి నిండా విభూతి దరించి శూలాల చక్రాన్ని ధరించి ఆలయానికి నడిచివెళ్ళారు. బాలబలికలు వివిధ రకాల కావళ్లను మోసుకెళుతూ నృత్యం చేశారు. ఆదివారం ఉదయం ప్రారంభమైన ఈ వేడుకలు సాయంత్రం వరకూ కొనసాగాయి. భక్తులకు ఆలయ నిర్వాహకులు తగు సదుపాయాలు కల్పించి అందరికీ ప్రసాదాలను పంచిపెట్టారు.

కంచి కామకోటి చైల్డ్‌ట్రస్ట్ హాస్పిటల్‌లో తల్లిపాల వారోత్సవాల ముగింపు



హీరో కార్తీకి స్వాగతం పలుకుతున్న చిన్నారి

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కంలోని కంచి కామకోటి చైల్డ్‌ట్రస్ట్ హాస్పిటల్‌లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ వేడుకల్లో ప్రముఖ సినీ హీరో కార్తీ ముఖ్య అతిథిగా పాల్గొని, శిశువులకు తల్లిపాల ఆవశ్యకత గురించి తల్లపాల సేకరణపై అవగాహన గురించి వివరిస్తూ ప్రసంగించారు. హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జనని శంకర్, డాక్టర్ ఎన్ చంద్రకుమార్, డాక్టర్ వానతి, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఎస్ రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

జోస్ అలూక్కాస్ 60వ వార్షికోత్సవం


విద్యా కార్యాలయానికి ఉపకరణాలు అందజేస్తున్న వీఐటీ వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, ఆగస్టు 11: స్థానిక తోటపాళ్యంలో ఉన్న జోస్ అలూక్కాస్ జ్యువలరీ 60వ వార్షికోత్సవం వైభవంగా జరిగాయి. వేడుకలకు ముఖ్య అతిథిగా తమిళ్ ఇయక్కమ్ అధ్యక్షుడు, వీఐటీ యూనివర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి రూ.6 కోట్ల విలువైన బహుమతుల పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోస్ అలూక్కాస్ సీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఎస్‌జీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొసవన్‌పుదూర్ వేలూరు, ప్రధాన విద్యా కార్యాలయానికి విద్యా ఉపకరణాలు, 10 కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, యూపీసీ తదితరాలు అందజేశారు. కార్యక్రమంలో మండల మేనేజర్ సునీల్‌కుమార్, అకౌంట్ విభాగం రమేష్, పీఆర్వో కార్తీదీపన్, ఉద్యోగులు, వినియోగదారులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత యూఎస్ కాన్సులేట్ టీమ్



విజయం సాధించిన జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఆర్కాట్ ప్రిన్స్ మహమ్మద్ అసీఫ్ అలీ

ప్యారీస్, ఆగస్టు 11 : ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి డిప్లొమాట్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా యూఎస్ కాన్సులేట్-చెన్నై టీమ్ ట్రోఫీ కైవశం చేసుకుంది. స్థానిక కొరట్టూరులో శని, ఆదివారాల్లో జరిగిన ఈ పోటీల్లో సుమారు 25కు పైగా జట్లు పాల్గొన్నాయి. ముఖ్య అతిథిగా మలేసియా కాన్సులేట్ - చెన్నై జనరల్ శరవణ కుమారవాసగం పాల్గొని టోర్నీలో పాల్గొన్న టీమ్‌లకు ప్రశంసాపత్రాలు, విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. ఏజే హరిహరన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఆర్కాట్ ప్రిన్స్ నవాబ్ మహమ్మద్ అసీఫ్ అలీ, సేతుకుమరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్కాట్ ప్రిన్స్ మహమ్మద్ అసీఫ్ అలీ మాట్లాడుతూ బాలికలపై లైంగికవేధింపులను అడ్డుకోవడం, బాల్యవివాహాలు, మానవుల అక్రమరవాణా అరికట్టడం వంటివాటిపై అవగాహన పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

తిరుచెందూరు ఆలయానికి పోటెత్తిన భక్తులు

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మురుగప్పెరుమాన్ కొలువైన ఆరు దివ్యక్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రంగా పేరుగడించిన తిరుచెందూరులోని సెంథిల్ ఆండవర్‌ను దర్శించేందుకు ఆదివారం వేల సంఖ్యలో భక్తులు గుమికూడారు. ఆడికృత్తిక ఉత్సవాల తర్వాత కూడా ఈ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఏ మాత్రం తగ్గటం లేదు. శని, ఆదివారాలు వారాంతపు సెలవులు కావటంతో రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శనివారం రాత్రి ఆలయానికి చేరువలో సముద్రతీరంలోనే భక్తులు జాగారం చేశారు. ఆదివారం ఉదయం సముద్ర స్నానమాచరించి సెంథిల్ ఆండవర్ స్వామి వారి దివ్యదర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఆదివారం వేకువ జాము నాలుగు గంటలకు ఆలయాన్ని తెరిచారు. 4.30 గంటలకు విశ్వరూపదర్శనం, ఉదయం 6 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన భక్తుల వాహనాలను నిలిపేందుకు నగరమంతటా పలు చోట్ల పోలీసులు పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేశారు. పోలీసుస్టేషన్ సమీపంలోను, ప్రైవేటు స్థలంలోనూ వాహనాలను పార్కింగ్ చేశారు. తిరుచెందూరు- నాగర్‌కోవిల్ రహదారిలోను వాహనాలను పార్కింగ్ చేయడంతో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నడిచి వెళ్ళి స్వామివారిని దర్శనం చేసుకోగలిగారు.


సెంథిల్ ఆండవర్ దర్శనం కోసం వేచి ఉంటున్న భక్తులు


తిరుచెందూరు సముద్రతీరంలో గుమికూడిన భక్తులు

జనని ఆధ్వర్యంలో శంకరంబాడి జయంతి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న జనని నిర్వాహకులు, ప్రముఖులు

చెన్నై, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జనని సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మహాకవి భారతినగర్‌లో తెలుగుతల్లి ముద్దుబిడ్డ శంకరంబాడి సుందరాచారి 110వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న వక్తలు సుందరాచారి రచనలు, వ్యక్తిత్వం గురించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. భారతి మహిళా కళాశాల తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు డా. నిర్మలా పళనివేలు మాట్లాడుతూ శంకరంబాడి జయంతిని తెలుగువారంతా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. మన రాష్ట్ర గీతాన్ని అందించిన ఘనత శంకరంబాడికే దక్కిందన్నారు. సీతారామనగర్ ప్రజా సంక్షేమ సంఘం మాజీ కార్యదర్శి పట్టాభి రామయ్య ప్రసంగిస్తూ ఒక హోటల్ సర్వర్‌గా ఉంటూ సాహిత్యంలో ఎనలేని కీర్తిగడించిన గొప్ప కవి సుందరాచారి అని ప్రస్తుతించారు. ప్రముఖ పాత్రికేయులు ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు తెలుగు భాషకోసం శంకరంబాడి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆర్.పోతురాజు, రాజేంద్రప్రసాద్ తదితరులు ప్రసంగించారు. జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య అనుసంధానకర్తగా వ్యవహరించారు.

వైభవంగా విష్ణుపద్మం విజయోత్సవం


అతిథులు హరినాథ్, జ్ఞానవేల్‌ను సత్కరిస్తున్న ఎస్వీ పద్మనాభన్, విష్ణుప్రియ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 11: వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 502ఎ రీజిన్ 3 జోన్ 1 ఆధ్వర్యంలో ఆదివారం విష్ణుపద్మం ద్వితీయ విజయోత్సవం వైభవంగా జరిగింది. అన్నాసాలై ఎస్వీఎస్ క్లబ్‌లో ఉదయం పది గంటలకు వాసవీమాత ప్రార్థనాగీతం, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకలకు జోన్ చైర్‌పర్సన్ ఎస్వీ పద్మనాభన్, విష్ణుప్రియ దంపతులు సారథ్యం వహించారు. భానుసప్తమి, గరుడ జయంతిని పురస్కరించుకుని లోకకల్యాణార్థం లలితాసహస్రనామ పారాయణం చేశారు. క్విజ్, ఫన్నీ గేమ్స్, మ్యూజికల్ చైర్ తదితర ఆటపాటలతో ఈ కార్యక్రమాలు మధ్యాహ్నం వరకు సరదాగా సాగింది. ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ అబ్బర్వర్ వీఎన్ హరినాథ్, గౌరవ అతిథిగా ముంజలూరు మురళీమోహన్, ఆత్మీయ అతిథిగా చెన్నై ఈస్ట్ ఎంవీఐ ఎస్‌ఏ జ్ఞానవేల్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. వాసవీక్లబ్ షావుకారుపేట చెన్నై, వనితా క్లబ్, షావుకారుపేట డైమండ్ చెన్నై క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, జిల్లా మాజీ గవర్నర్ పి. వెంకటసుబ్బయ్య - హరిత, సీఎం రాజేష్- శైలశ్రీ, 2019 డిస్ట్రిక్ట్ ట్రోఫీ విన్నర్ బండారం అనంతపద్మనాభం- తనూజా, భోగనాధం శివకుమార్ - సుమవంశీ, సత్యమూర్తి, ఉపేంద్రకుమార్- వరలక్ష్మి దంపతులు, బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోదానం మహా పుణ్యఫలం

● ఎస్కేపీడీ గోశాలకు 25 గోవులు

ప్యారీస్, ఆగస్టు 11: స్థానిక జార్జి టౌన్‌లో ప్రసిద్ధి చెందిన శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానానికి (ఎస్కేపీడీ) అనుబంధంగా ఉన్న గోశాలకు వాసవీక్లబ్ టూస్టార్ కేసీజీఎఫ్ ఎలైట్ చెన్నై, వనితా క్లబ్‌ల అధ్యక్షులు సూరిశెట్టి బాలాజీ, దివ్య దంపతులు 25 గోవులను దానంగా అందజేశారు. ఆదివారం ఉదయం ఎస్కేపీడీ ప్రాంగణంలో ప్రధానార్చకులు భాస్కర పంతులు బృందం భానుసప్తమి పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తర్వాత గోవులను దానం చేసిన 25 మంది దంపతులు గోవులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ గోవులను దానం చేయడం వల్ల మహాపుణ్యఫలం ప్రాప్తిస్తుందన్నారు. ఆలయానికి గోవులను దానంగా అందించిన దాతలకు ఎస్కేపీడీ ట్రస్టీ ఎస్ఎల్ అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్సీ జీకే మహేంద్రన్, కోశాధికారులు పి. వెంకటేశ్- వనితాశ్రీ, డాక్టర్ ఎంవీ నారాయణగుప్తా- జ్యోతి, పీఎల్వీ సుబ్బారావు- వినూష, డాక్టర్ సుజాతరమేష్‌బాబు, కేఎస్ సురేష్‌బాబు, మాజేటి జగదీష్, కుమరవేల్- చిత్ర దంపతులు సహా గోశాల సంరక్షకులు తదితరులు పాల్గొన్నారు.


గోవులను దానం చేస్తున్న దాతలు

కన్నియాకుమారిలో పర్యాటకుల సందడి


వివేకానంద రాక్ వద్ద పర్యాటకులు

పెరంబూర్, ఆగస్టు 11: అంతర్జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కన్నియాకుమారి ఆదివారం భక్తులతో సందడిగా మారింది. కన్నియాకుమారికి ప్రతిరోజు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారాంతపు సెలవులు, పండుగ రోజుల్లో పర్యాటకుల రద్దీ అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, ఆదివారం తెల్లవారుజామునే వందలాది మంది పర్యాటకులు త్రివేణి సంగమం, సన్ రైజ్ పాయింట్ రాక్ ప్రాంతాలకు చేరుకొని, సూర్యోదయం వీక్షించి పరవశించారు. అనంతరం త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు, పడవల్లో సముద్రం మధ్య ఉన్న వివేకానంద రాక్‌ను సందర్శించారు. గాంధీ మండపం, కామరాజర్ స్మారక మందిరం, సునామీ స్మారక పార్క్, బీచ్ సమీపంలోని తమిళన్ పార్క్, సన్‌సెట్ పాయింట్, ప్రభుత్వ మ్యూజియం, ఎకో పార్క్ తదితర ప్రాంతాలు కూడా పర్యాటకులతో కిటకిటలాడాయి. పర్యాటకుల రద్దీ అధికంగా ఉండడంతో పోలీసులు, కోస్ట్ గార్డ్ సిబ్బంది బీచ్ ప్రాంతాల్లో గస్తీ చేపట్టారు.

మదురైలో మహిళల 'ఇండిపెండెన్స్ వాక్'

పెరంబూర్, ఆగస్టు 11: మదురైలో మహిళల 'ఇండిపెండెన్స్ వాకథాన్' జరిగింది. దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని, మన సంప్రదాయంలో చీరలు ధరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. మదురై ఒత్తకడై ఆదివారం జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆర్గనైజర్లు ఇలంకుమరన్, గోపాలకృష్ణన్ నేతృత్వం వహించగా, ముల్లైపెరియార్ ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షుడు మూర్నాడు జెండా ఊపి ప్రారంభించారు. ఒత్తకడైలో ప్రారంభమైన ఈ వాకథాన్ నరసింగం ఆలయం వరకు సాగింది. ఈ వాకథాన్‌లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కాగా, వాకథాన్ మహిళలందరూ చీరలు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు.


వాకథాన్‌లో మహిళలు